చుక్కాని వారపత్రిక: 1-7-1960

# పూర్ణయ్య పంతులు

"ఖిరవాటుండొకండు...."

తమ మెత్తని, కమ్మని కంఠంతో పూర్ణయ్య పంతులుగారు పద్యమందుకున్నారు!

పిల్లలంతా గొల్లుమన్నారు! పద్యం చదవటం ప్రారంభం కాగానే, చదువుతున్న పద్యాన్ని ఆపేసి ఆశ్చర్యంగా అవలోకించారు క్లాసునంతా పూర్ణయ్యగారు!! వాళ్ళెందుకు అంత ఆనంద భరితులౌతున్నారో అప్పుడు పూర్ణయ్యగారికి అర్థంగాలా,

"మీ పిండం పిల్లులకు దానాగా వెయ్యా! ఎందుకురా అలాగున నవ్వుతారు?... అరే! మిమ్మేల్నేరా! వెధవాయిల్లారా? మాట్లాడరేం?" అంటూ పిల్లల్ని ప్రశ్నించారేగాని, చలిమిడి ముద్దలాంటి తలకాయమీద పచార్లు చేస్తున్న చెయ్యిని మాత్రం స్థానభ్రంశం చెందించలా!

ఆనంద కందళిత హృదయులై, ఉక్కిరి బిక్కిరౌతున్న పిల్లలు, పంతులుగారి నున్నటి, నిగనిగలాడుతున్న తలకాయ మీద, చెయ్యి పెట్టి నిమురుకుంటుంటే నవ్వకేం చేస్తారు?

తమ హస్తం ఖరవాటం మీదున్నదనీ, ఏతత్ కారణం వల్ల పిల్లలు నవ్వుతున్నారనీ బహు కొంచెంసేపటికిగానీ ఆయనకు తట్టలా! తట్టగానే నాలిక్కొరుక్కొని 'ఛ, ఛ వెధవ చెయ్యి, నీకేం పోయేగాలం దాపురించింది. సమయానికి నెత్తికెక్కుతావ్?' అని స్వగతంలో తిట్టుకుని అదీ అచ్చ తెలుగులో- "ఏడిశార్లే! సన్నాసుల్లారా ఇహ ముయ్యండోయ్ నోరు!....! ఉః..... మిమ్మల్నే!.... ఎవఢ్రా అది! ఎముకలేరేస్తాను ఏమనుకున్నారో!" అని కోపగించు కున్నారు.

పంతులుగారి ఆగ్రహానికి పిల్లలంతా నవ్వు ఆపేశారు. కానీ ఓ కుర్ర కుంక పొర్లివస్తున్న ఆ మహానందాన్ని ఆపుకోలేక, చాటుగా కిసుక్కుమన్నాడు!

"ఖరవాటుండొ...." అని పద్యం అందుకోబోయిన పూర్ణయ్యగారు, "ఎవఢ్రా అది? తాట ఒలిచేయగలను" అని అనేసరికి వాడూ గప్‌చిప్‌గా నోరు మూశాడు!

ఆ రోజు పద్యం సంగతెలా ఉన్నా, ఆ పూర్ణయ్యగారు చెప్పిన తెలుగునంతా ఏ కాశీ విశ్వేశ్వరుని సమక్షంలో తర్పణ దక్షిణలతో సహా వదిలేసినా, పంతులుగారి ఖరవాటాన్ని, దానిపై పచార్లు చేసే హస్త చాతుర్యాన్ని ఆ పిల్లలు జన్మజన్మాలకీ మర్చిపోరేమో!

పూర్ణయ్యగారు టీచరు, భమిడిపాటివారన్నట్లు "అసలే పంతులు. అందులో తెలుగు పంతులు. ఆపైన ఇంగ్లీషు వాళ్ళ తెలుగు బళ్ళో తెలుగు పంతులు" కాదు పూర్ణయ్య గారు. ఈయన తెలుగు వాళ్ళ ఇంగ్లీషు బళ్ళో తెలుగు పంతులు.'

శుభ్రమైన శిష్టాచార సంపన్న గృహంలో పుట్టిన పూర్ణయ్యగారు, కూటి కోసం లేకపోతే కడుపు కక్కుర్తి కోసం అభిమానం అడ్డొచ్చినా త్రోసిరాజని, ఉపాధ్యాయ వృత్తిలో దూరాడు. ఆస్తిపాస్తులంటూ ఏమన్నా ఉంటే అవి పూర్ణయ్యగారి తాతతండ్రుల 'ఆయం పటాటోపా లకు' హరించుకు పోయినయ్! ఆ దేవుడన్నా, కాస్త చల్లగా చూశాడు గాబట్టి, ఆ నాలుగు అక్షరం ముక్కలు అబ్బి, ఈ నాటికి జీవనోపాధికి అక్కరకొచ్చినయ్! అటు ఆస్తిపాస్తులూ లేక యిటు అక్షర జ్ఞానం లేకపోతే ఈ కలియుగంలో కాలం వెళ్ళమార్చటం కాని పని. అందుకని 'బ్రతకలేక బడిపంతులు' అన్న లోకోక్తి వున్నా, పంతులు పనిలో చేరక తప్పింది కాదు!

పూర్ణయ్యగారు హైస్కూలు తెలుగు పండితుడుగా చేరేసరికి ఓ ఆడపిల్ల తండ్రి. అప్పటికి పూర్ణయ్యగారి మాడున నాలుగు పరకలుండేవి. కాలక్రమేణా కరువు రోజులలో

బ్రతుకు వెళ్ళమార్చటం నానాటికి కష్టం గావటంతో - అదిన్నీ గాక ఆదాయ వ్యయాలెలా వున్నా, సంవత్సరం తిరిగేసరికి, దిగుమతి అవుతున్న ఆడ సంతానం.... ఉన్న పిల్లలైనా ఆరోగ్యం లేక - రోగాలు, రొష్టు, జలుబులూ, పడిశాలూ, మందులూ మాకులూ.... ఈ యమయాతనాయుతమైన భారంతో అదివరకున్న నాలుగు పరకలు గాలికి ఎటో లేచి పోయినయ్! అసలు పూర్ణయ్య పిల్లను చూట్టానికి వెళ్ళినప్పుడే ఎవరో - "పిల్లాడయితే ఎఱ్ఱగా, నున్నగా ఉన్నాడు గానీ... నెత్తి మీద మనసు బడ్డా నాలుగు వెంట్రుకలు లేవమ్మా" అని అన్నారు. అలాంటివి అరడజను పిల్లల తండ్రైనప్పుడు యిప్పుడేముంటాయి గనుక!?

భమిడిపాటి ఇలాంటి ఉపాధ్యాయుణ్ణి దృష్టిలో పెట్టుకొనే "పంతులుగారికి ఉద్యోగం చరాస్థి; భార్యాబిడ్డలు స్థిరాస్థి" అని నుడివాడు గామాలు!

ఆలోచనలతో సతమతమౌతూ ఓ ప్రక్కనుంచి వేరొక వేపుకు తిరిగాడు. ఇక్ష్వాకుల నాటి పాత కుర్చీ 'అయ్యబాబోయ్' అన్నట్లు మొరబెట్టింది. అందుకూ చలించక కూర్చున్న పూర్ణయ్యను చూసి ఏమీ చెయ్యలేక కోపంగా ఊగటం ప్రారంభించింది.

"వెధవ కుర్చీలు, కుర్చీ అన్నమాటేగాని ప్రాణానికి సుఖముండదు. ముళ్ళ మీద కూర్చున్నట్టే.... వచ్చే డబ్బంతా ఏ గంగలో పోస్తున్నారో గానీ.... పంతుళ్ళకు ఏ నెలా జీతాలు సరిగ్గా అందవు. పోనీ స్కూలు క్కావలసిన సరంజామా చూద్దామా యిలా అఘోరిస్తాయి.... ఏమి విద్యాసంస్థలో? ఏం ఖర్మమో? పంతుళ్ళకు జీతాలందకపోయినా కాస్త జీతం పెంచమన్నా పెద్ద ఉపన్యాసాలు! అలా అంటావేమిటయ్యా పంతులూ మనమిప్పుడు దేశ పునర్నిర్మాణంలో తలమునకలుగా వున్నాం. ఈ సమయంలో జీతాలు పెంచమనీ, అవ్వనీ యివ్వనీ గొంతెమ్మ కోరికలు కోరడం ఏం భావ్యం చెప్పు?" అందుకనే చదువులిట్లా వున్నాయ్! మనసెక్కడో సంచారం చేస్తుంటే పంతుళ్ళు పాఠాలేం చెప్తారు? అథవా బుద్ధిమాలి శ్రద్ధగా చెప్పినా పిల్లలేం వింటారు? పంతులు చెప్పి పిల్లలు వినక, వాళ్ళు ప్యాసు కాకపోయినా పంతుళ్ళకే ముప్పు. "జీతాలు పెంచమని అడుగమనండి. ఎంతో ఉత్సాహంతో గొంతు పెగిలేలా నినాదాలు చేస్తారు, విద్యార్థులెందుకింత తక్కువ శాతంలో ప్యాసవుతున్నారంటే నోరు పెగల్దు" అంటూ సాధింపులు; ఎటుకూడి పంతులుకే ఎసరు.... ఎమిటో వెధవగోల!" అంటూ ఘట్టిగా ఊపిరి పీల్చి వదిలేశారు ఆలోచనగా!

పంతులుగారికి తెల్లవారితే ఎలా గడవాలో తెలియటంలా! పెళ్ళాం నీళ్ళాడే నెలలు. రానున్నవి పండుగ రోజులు. ఎంత లేనివాడైనా కన్న కూతుర్ని, అల్లుడ్ని పండుగకు పిల్చుకుంటాడు. పదిట్లో పెళ్ళి చేసి పంపినతరువాత మళ్ళీ పిల్చి ఓ రవిక గుడ్డన్నా పిల్లదానికి పెట్టలేదు. ఏం బెడతాడు? ఎక్కడ తెచ్చిబెడతాడు? ఆ పిల్లదాన్ని ఓ యింటిదాన్ని చేసేసరికి తాడు కాస్తా పుటుక్కున తెగింది. ఆ పెళ్ళి చెయ్యటానికింత కచాడీ పడాల్సి వచ్చింది. అసలీ కాలం బుద్ధులే అంతే గామాలనిపిస్తుంది. పంతులుగారికి. శుభ్రంగా తిని తిరుగుతున్నది కాస్తా, యింటా, వంటా లేని ప్రేమంటూ బయల్దేరతీసింది. వాడేమో

ఓ అలగాజాతి వాడు. వాడితో దీనికి (పద్మకు) ప్రేమ వ్యవహారాలు. "అదేం పోయేకాలమే నీముండ మొయ్యా" అంటే!-

"ప్రేమకు నీతీ జాతీ ఏమిటి నాన్నా! ప్రేమ పవిత్రమైనది...." అంటూ ఏమిటేమిటో వల్లెవేయటం ప్రారంభించింది. మొదట పంతులుగారు దిమ్మరపోయినా 'ఇట్లా అయితే యిది ఏ అర్ధరాత్రో అపరాత్రో ఆ వెధవ, ఆ నాపవెధవతో ఎక్కడికైనా ఉడాయించినా ఉడాయించగలదు' అని యెంచి, యోచించి, బాణాకఱ్ఱ తీసి, కొట్టినచోట కొట్టకుండా చావబాది, గదిలో బెట్టి తాళం బిగించి తాళం చేతులు రొంటిన తోపుకుని బడికి పోవటం ప్రారంభించాడు! కాని యెంతకాలం యిట్లా? ఇది పని కాదనుకుని మేనేజుమెంటు కాళ్ళు కన్నీళ్ళతో కడిగేసి, పదిపైన ఐదు రోజులు సెలవు గ్రాంటు చేయించుకొని ఆంధ్ర దేశమంతా ఓసారి పైపైన యాత్ర చేసుకుని ఆఖరుకు ఎట్లాగైతేనేం, ఒక సంబంధం ఖాయం చేసుకొచ్చారు! భార్య మొగుడు ఘనకార్యానికి సంతోషించి, "పోనీలెండి ఏదో ఒకటి, ఎంత త్వరలో ఆ కాస్తా అయిందనిపిస్తే అంత మంచిది" అని అనేసింది!! కానీ పిల్లది మాత్రం పెళ్ళయి అక్కరనాడు పోయేవరకూ గునుస్తూనే ఉంది. కానీ ఆ తర్వాత మానేసిందనుకోండి! మానేయకేం చేస్తుంది? అంత ప్రేమా ఒలకబోసింది ఆ అలగా వాడి మీద - యిప్పుడేమో - మొన్నీ మధ్యనే ఓసారి చూసొచ్చాడు లెండి- "అయ్యో అప్పుడే ఏడయిందే! ఉండు నాన్నా! లేవంగానే కాఫీ లేంది వారికి తల నొస్తుంది!..... అదేమిటండీ మీరు తింటారని (పంతులుగారు ప్రక్కనే వున్నారు) పోపదీ బాగా వేస్తే, వ్రేలన్నా పెట్టలేదా కూరలో?.... అబ్బ వుండండి! అయ్యో మిమ్మల్నే వేన్నీళ్ళు తెచ్చేలోగా ఆ తొందరెందుకు - చన్నీళ్ళు చేస్తారో లేదో యిట్టే పడిశం పట్టేస్తుంది నాన్నా!" అంటూ మొగుడ్ని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నది. ఏమిటో! ఏం లోకం! పిల్లదాని తరహాకు పంతులుగారికెందుకో నవ్వొచ్చింది. నవ్వేశారు!

ఆఫీసులో అప్పుడే ప్రవేశించిన రైటరుకు పంతులుగారు కళ్ళు మూసుకుని అలవోకగా చిరునవ్వు నవ్వటం అర్థంగాలే!

"ఏం పూర్ణయ్యగారు చిరునవ్వులొలకబోస్తున్నారు. ఏమిటి కథ?" అంటూ పలకరించాడు.

ఉలిక్కిపడి, "నువ్వా. ఆ ఏముంది? అలా కూర్చుంటె మాగన్నుగా నిద్ర పట్టింది గామాలు! ఏమిటో కలలు! ఏమున్నాయ్? కల్ల జీవితంలో పట్ట పగలే కలలు!..... ఆ..... అది సరే కాని!.... పిచ్చిక లేమన్నా....." ఆశగా రైటరు కళ్ళల్లోకి చూశారు పంతులుగారు.

ఆ చూపులు ఆ రైటరుకే తెలుసు. తెలుసుకున్నవాడు చిరునవ్వు నవ్వి, "ఆ! ఆ! వచ్చినవి లెండి!" అని తలూపాడు.

పంతులుగారి హృదయం తేలిక పడ్డది. కమిటీలో సభ్యులంతా ఛైర్మెన్‌షిప్పు కోసం కూట దొమ్మీలూ, ముసుగులో గుద్దులాటలు మొదలైన మల్లగుల్లాలు పడుతూ,

పంతుళ్ళకు జీతం రాళ్ళివ్వటం మర్చేపొయ్యారు. మర్యాదగా బ్రతుకుతున్న పూర్ణయ్య లాంటి వాళ్ళు ఎలాగోలా అప్పు పుట్టించుకొని సంసారాలను గుట్టుగా గడుపుకోగలరు. మరి అందరి సంగతీ అలా కాదే! కొందరి జీతపు రాళ్ళు ఏ నెలకా నెల కళ్ళబడుతుంటేనే సంసారం గతుకుల బాట మీద రెండెడ్ల బండిలా సాగుతుంటుంది.

"అయితే రెండునెల్లదీనా?" పూర్ణయ్యగారు మళ్ళీ ప్రశ్నించారు రైటర్ని.

"సరేలే! ఒక నెలది సొంతం వస్తే నయమే!.... ఎందుకులే! కాలం కలసిరాక యిక్కడ బ్రతుకుతున్నాం గానీ! మరొకడైతేనా!..... మన్యం ప్రాంతానికైనా కుటుంబ సమేతంగా పోతాడు గానీ, ఈ పంతులు పనికి, అందులో యిలాంటి స్కూలుకు చస్తేరాడు."

నిజమే మరి! జీతాలు సరిగా ముట్టక, అందులోనూ మాట్లాడితే ప్రతి కమిటీ సభ్యుడూ పర్యవేక్షణే. ఈ ఎడాపెడా దెబ్బలకు తట్టుకోలేకనే క్రొత్తగా వచ్చిన సైన్సు టీచరు చెప్పకుండా మరీ పోయాడు!

పూర్ణయ్యగారు వచ్చే జీతపు రాళ్ళకు, అయిన ఖర్చుకు లంకె కుదర్చటానికి ఉపాయాలాలోచిస్తున్నారు. పెళ్ళాము నీళ్ళాడడానికి సిద్ధంగా ఉంది. ఎప్పుడా పరమాత్ముడు లగువు బిగువ చేస్తాడో అని పూర్ణయ్యగారు బేజారెత్తి పోతున్నాడు. అబ్బబ్బ! ఎప్పటికప్పుడు ఈసారన్నా పుత్ర ప్రాప్తి కలుగుతుందని వేయి కళ్ళతో నిరీక్షించటం - తీరా ఫలితం మరో ఆడపిల్ల! ఏమిటో! మానవ మాత్రులం!! అనుకున్నవన్నీ జరుగుతాయి గనకనా!? అట్లాగని ఆలోచించటం మానుకుంటున్నాడా! అంతదాకా ఎందుకు మన పూర్ణయ్యగారినే తీసుకోండి! వచ్చే జీతం పెళ్ళాం పురిటికి, అల్లుడూ, కూతురూ వస్తే పండుగకు, యింకా నెలసరి వ్యయానికి చాలదని ఖరారుగా తెలుసు! అయినా ఎందుకో ప్రయాస - పెరుగుతున్న ఖర్చుకు, పెరగని జీతానికి సరిపుచ్చాలని.

ఆయన అల్లిబిల్లి ఆలోచనలకు ఆయనకే ఆశ్చర్యం వేసింది. రాను రాను ఏమనిపిస్తున్నదంటే.... ఏ సన్యాసులలోనన్నా కలిసిపోదామనిపిస్తుంది. అసలు అనుకున్నవన్నీ అవుతాయా? కావు.

ఇంతలో ఎవరో కుర్రాడు రొప్పుకుంటూ రొజుకుంటూ ఆఫీసు రూంలోకి ప్రవేశించాడు. జీతం లెక్కపెట్టుకుంటున్న పూర్ణయ్యను చూసి, "మేస్టారు! అమ్మగారికి.... మరేమో ఆడపిల్లండి! మిమ్మల్నేమో అర్జంటుగా రమ్మన్నారండి!.... ఆరికేమో.... వాతంటండీ!" అనన్నాడు.

పంతులుగారు నిర్విణ్ణులయ్యారు! కాసేపటికి తెప్పరిల్లుకుని, తాతల నాటి బైసికిలు మీద గృహోన్ముఖులయ్యారు ఆదుర్దాగా....!!

●